సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలుపుతున్న ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ యాకయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. 30 సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగానే నేడు ఈ తీర్పు వచ్చిందన్నారు. శుక్రవారం ఈజీఎస్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ అందె యాకయ్య ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయక తప్పదన్నారు. మాదిగలంతా ఐకమత్యం, ధైర్య సాహసాలతో పోరాటాలు చేయడం వల్లనే ఈ వర్గీకరణ సాధ్యమైందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ స్థాపించిన తరువాతనే మాదిగల్లో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పట్టువదల కుండా తాను చేసిన ఉద్యమం వల్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా ఇచ్చిందని తెలిపారు. ఈ ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని ఆయన హితువు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్, నరేష్ మాదిగ, అందె సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు వెంటనే చెల్లించాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించడంతో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరికి నిరసనగా ఈ నెల 24వ తేదీన శనివారం మందలాది మంది విద్యార్థులతో మాసబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల మెస్ చార్జీలను చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ చార్జీలను గ్రీన్ చానల్ పద్ధతిలో చెల్లింపు చేయాలని అన్నారు. హాస్టళ్ల వర్కర్ల సంఖ్యను పెంచాలని, సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, వేతనాలు సమయానికి చెల్లించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకులాల్లో సీట్లు కేటాయించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

సేవాభావంతో ముందుకు సాగినప్పుడే ఆదరణ

భారత్ సేవాశ్రమం నగర అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద



కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్వామి మునీశ్వరానంద

కవాడిగూడ: సేవాభావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభిస్తుందని భారత్ సేవాశ్రమం హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద అన్నారు. దాదాపు వంద మంది జీహెచ్‌ఎంసీ సిబ్బందికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు శుక్రవారం భారత్ సేవాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు అండగా ఉండడానికి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర గొవర్నర్ కూడా భారత్ సేవాశ్రమం చేస్తున్న సేవల పట్ల సంతోషం వ్యక్తం చేశారు అని తెలిపారు. సేవాభావంతో మరింత ముందుకు సాగుతూ పేదలను ఆదుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానందతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రస్తుతం ఉన్న విద్యార్థుల మెస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.4వేలకు పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్వేళ్ల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి నవంబర్ 22న వరంగల్‌లో నిర్వహించే విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్ శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు.

◆ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపల్స్‌లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పర్మనెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ కాలేజీలలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీలు, స్పోకెన్ ఇంగ్లిష్, సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

◆ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలను ఏర్పాటు చేయాలన్నారు. స్టూడెంట్స్ పే కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మెదీ రాందేవ్, హేమంత్, సి.రాజ్‌కుమార్, సత్యనారాయణ, జి.శ్రీనివాస్, ప్రసాద్, సతీష్, గోవిందరాజు, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

భౌ.. భయం



● పరుగులు పెట్టిస్తున్న వీధి సింహాలు ● ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు



బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు సమీపంలో వీధి కుక్కలు



రాంనగర్‌లో వీధి కుక్కలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి, నల్లకుంట, సుందరయ్య పార్కు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో పాలుపోకా సతమతమవుతున్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో వీధి కుక్కల బారినపడి చిన్న పిల్లలు చనిపోయారు. ఓ మహిళ ఉదయం 5గంటల ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్తుండగా పదికిపైగా కుక్కలు వెంటపడి తీవ్రంగా గాయాలపాలు చేశాయి. ఇలా అనేక చోట్ల వీధి కుక్కల బెడద ఉన్నప్పటికి జీహెచ్‌ఎంసీ అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం...

వీధి కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అనేక మంది ఇప్పటికే వీధి కుక్కల బారినపడి నారాయణగూడలోని వైఎంసీఏ ఆసుపత్రి, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే వీధి కుక్కలకు ఎలాంటి వాక్సిన్ ఇవ్వకపోవడం వల్ల రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుకుంటున్నారు.

డాగ్స్ నియంత్రణ సెల్ పనితీరుపై విమర్శలు...

నగరంలోని జీహెచ్‌ఎంసీ పరిసర ప్రాంతంలో డాగ్స్ నియంత్రణ సెల్ సక్రమంగా పని చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. కుక్కల బెడదపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తే ఇది మాకు సంబంధించింది కాదనీ దీనికి ప్రత్యేకమైన సెల్ ఉందని చెబుతూ బాధ్యతారహితంగా వ్యవహరించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ డాగ్స్ సెల్‌కు సంబంధించిన అధికారులు తమ ఫోన్ నంబర్లను నగరంలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా డివిజన్‌లోని ముఖ్య ప్రాంతాల్లో తమ నంబర్లను ఇస్తూ ప్రచారం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి



రాంనగర్ డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ముఖ్యంగా బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి, సుందరయ్య పార్కు, నల్లకుంటలో గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో తిరగాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని పోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలి. - బి.వెంకటస్వామిగౌడ్

25న ప్రతిభా పురస్కారాల ప్రదానం

కాచిగూడ: పదో తరగతి, ఇంటర్మీడియట్ (2023–24)లో ప్రతిభ చాటిన మున్నూరు కాపు విద్యార్థులకు ఈనెల 25న ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్యహాల్‌లో ఉదయం 10గంటలరే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

శుభాకాంక్షలు



ప్రొ. సునీల్‌కుమార్ సన్మానిస్తున్న మల్లేశ్, జావిద్, డేనియల్, టోనీలు

చిక్కడపల్లి: ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రొ. సునీల్‌కుమార్‌ను శుక్రవారం బీఎస్ఎస్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ సర్కిల్ సలహాదారుడు మల్లేశ్ ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్ జావిద్, డేనియల్, టోనీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

ముషీరాబాద్: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దోమల వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశావర్కర్లు, మలేరియా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదుపు పథకాలతో భవిష్యత్‌కు భరోసా



చిక్కడపల్లి: తపాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌లో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(డీసీడీసీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నే కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. పొదుపు పథకాలతో మహిళలు, ఆడపిల్ల భవిష్యత్‌కు భరోసా ఏర్పడుతుందన్నారు. జీవిత బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ స్కీమ్‌లను సేవింగ్ ఖాతాలతో అనుసంధానం చేస్తూ అందిస్తున్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు దండపూడి సాగర్, ఫిరోజ్‌ఖాన్, జనప్రియ అబోడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిదాస్, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా కుర్ని కుల సంఘం ఎన్నికలు

ముషీరాబాద్: బీసీ చేనేత సామాజిక వర్గానికి చెందిన కుర్ని(బీసీ–బీ) కుల సంఘ ఎన్నికల్లో కొంత మంది ఏకపక్షంగా వ్యవహరిస్తూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారని ప్రజాస్వామ్య హితంగా కుర్ని కుల సంఘ ఎన్నికలు నిర్వహించాలని కుర్ని యువసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుర్ని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కొదండరాంకు వినతిపత్రాన్ని సమర్పించారు. చేనేత వృత్తిగా ఉన్న కుర్ని కులానికి సంబంధించి 2015 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘం పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారని ఈ సంఘం కులంలోని పేదల సంక్షేమం పట్ల ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన తెలిపారు. 2015 సంవత్సరంలో ఎంపికైన సంఘం సభ్యులే ఇప్పటికి కొనసాగుతున్నారని నూతన కమిటీ ఎన్నిక కోసం ఒత్తిడి చేయగా కొంత మంది వ్యక్తులు రహస్యంగా సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఈ నూతన కమిటిని తాము గుర్తించడం లేదని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగేలా చూడాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



11 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సీఎంఆర్‌ఎఫ్‌ను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. అడిక్మెట్, ముషీరాబాద్ డివిజన్లకి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ 11చెక్కులు రూ.3.37,000 లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్, అడిక్‌మెట్, గాంధీనగర్ డివిజన్ డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముదారపు రాకేష్‌కుమార్, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, అస్లాం, భాస్కర్, బల్వంత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌ఓలకు బయోమెట్రిక్, ఐరిస్ పరికరాల అందజేత



మాట్లాతున్న కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్

చిక్కడపల్లి: రాష్ట్రంలోని నిర్మాణ కార్మికుల సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్ అన్నారు. కార్మికుల సంక్షేమ కోసం ఆధునిక విధానాలను తీసుకొస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో జిల్లాల కార్మిక శాఖ అధికారులకు బయోమెట్రిక్, ఐరీస్ పరికరాలను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 118 మంది అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లకు (ఏఎల్‌ఓ) బయో మెట్రిక్, ఐరిస్ పరికారాలను అందజేశారు. అనంతరం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం అందించే లేబర్ కార్డులకు(బీఓసీ) ఆధార్, ఖచ్చితమైన ధ్రువీకరణ, ఇతర మార్పులు సులభతరం చేసే విధంగా అన్ని విధాలుగా అధునాతన పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రక్రియ ఎల్‌ఓలకు కార్మికులకు కూడా సులభతరం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శిక్షణలో 33జిల్లాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. విద్యానగర్ ఫీడర్ పరిధిలో విద్యానగర్, అడిక్‌మెట్, బ్లడ్ బ్యాంక్, వడ్డెర బస్తీ, ఎస్ఆర్‌టీ క్వాటర్స్ తదితర ప్రాంతాల్లో 10 నుంచి 11.30, నారాయణగూడ ఫీడర్ పరిధిలో బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యుఎస్ క్వాటర్స్, అరోరా డిగ్రీ కాలేజీ, నెహ్రూనగర్, సూర్యనగర్, మానసా ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి ఒంటి గంట వరకు, బతుకమ్మ కుంట ఫీడర్ పరిధిలో పాముల బస్తీ, బతుకమ్మ కుంట, మలన్న టెంపుల్, గంగానగర్, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

26న బాలగోకులం, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు

కాచిగూడ: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన సాయంత్రం 4గంటలకు నృపతుంగ స్కూల్ ప్రాంగణంలో బాలగోకులం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి రమేష్ మంజునాథ్ తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కృష్ణుడి వేషధారణ, 6–10 ఏళ్ల చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, 11–15ఏళ్ల వారికి భగవద్గీత శ్లోకాలు, తాత్పర్యం పోటీలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం .98850 57640, 83090 35132.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్ తదితరులు ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరైన సమయానికి భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సందానంద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ తిరుమల, బాపూజీనగర్ అంగన్‌వాడీ టీచర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు చెట్లకొమ్మల తొలగింపు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ పటాన్‌బస్తీలో విద్యుత్ తీగలకు అనుకొని ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను శుక్రవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది కట్ చేశారు. వర్షం, ఈదురు గాలులు వీచినప్పుడు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలి మంటలు వస్తున్నాయని డివిజన్ బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సర్వర్ తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యే అధికారులకు సూచించడంతో చెట్ల కొమ్మలను తొలగించారని అన్నారు.

మహిళలపై హత్యాచారాలను అరికట్టండి

ముషీరాబాద్: దేశంలో మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పివోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.స్వరూప, సిహెచ్ శిరోమణి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్ మాట్లాడారు. చిన్న పిల్లలు సైతం గ్యాంగ్ రేపులకు గురవుతున్న భయంకర పరిస్థితికి నేటి సమాజం చేరుకుందన్నారు. అర్ధరాత్రి ఆడపిల్లలు బయట తిరగడం కాదు, పట్ట పగలు జనారణ్యంలో తిరిగే పరిస్థితి లేదన్నారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలు యథేచ్ఛగా అమ్ముతున్నా వాటిని నియంత్రించడం లేదన్నారు. యువత మత్తులో తేలుతూ అనేక వికృత క్రీడలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి ఓ ఉదాహరణే కోల్‌కతా డాక్టర్ హత్యాచార ఘటన అని అన్నారు.

స్మారక పురస్కారం ప్రదానం



ఉమామహేశ్వరికి పురస్కారం ప్రదానం చేస్తున్న రమణాచారి

చిక్కడపల్లి: వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగరాయగాన సభలో డాక్టర్ జమునారమణారావు జయంతిని పురస్కరించుకుని ప్రముఖ సంస్కృత హరికథా కళాకారిణి ఉమామహేశ్వరికి వంశీ జమున స్మారక పురస్కారాన్ని శుక్రవారం రాత్రి ప్రదానం చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. జమున గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఉమామహేశ్వరి తెలుగుతో పాటు సంస్కృత భాషలోనూ హరికథ చెప్పగలరన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమ చరిత్ర సావిత్రీ, జమున లేకుండా పూర్తికాదన్నారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖులు కేవీ కృష్ణకుమారి, కళాకృష్ణ,రామకృష్ణ,సాయి,మేఘన,వీణ,శైలజ పాల్గొన్నారు.

హైలైట్‌గా 'నేను సైతం ప్రపంచాగ్నికి సాంగ్'



చిక్కడపల్లి: ప్రముఖ నటుడు చిరంజీవి సినిమాలో సుద్దాల అశోక్ తేజ రాసిన 'నేను సైతం ప్రపంచాగ్నికి' పాట హైలైట్ అని ఆ పాటకు జాతీయ అవార్డు అందుకున్నారని ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయగానసభ ప్రధానవేదికపై కళారవిందం ప్రముఖ సంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా పాటల సందడితో శుక్రవారం అలరించారు. అతిథులుగా వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖ గాయకుడు త్రినాథరావు, సంఖ్యక శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజను సంస్థ పక్షాన సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రామ్‌కుమార్, సుద్దాల అశోక్‌తేజ చిరంజీవి వ్యక్తిత్వాలను ప్రశంసించారు.

గణేష్ చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

- గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ మొగులయ్య
- గణేష్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య

కవాడిగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా గణేష్ మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గాంధీనగర్ సబ్ డివిజన్ ఏసీపీ మొగులయ్య కోరారు. అనుమతి లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేసినా.. డీజేలు పెట్టినా కఠిన చర్యలు తప్పవని ఆయన గణేష్ మండప నిర్వాహకులకు హెచ్చరించారు. గాంధీనగర్ సబ్ డివిజన్ పరిధిలోని దోమలగూడ, గాంధీనగర్, లేక్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ మండప నిర్వాహకులతో శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని మండమైసమ్మ నగర్ కమ్యూనిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు.

◆ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మొగులయ్య మాట్లాడుతూ... అనుమతి లేకుండా రోడ్లపై, చౌరస్తాలలో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పోలీసు అనుమతి పొందిన నిర్వాహకులు విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ నిమజ్జనం, ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో, వీలైనంత త్వరగా ముగించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలన్నారు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి గాంధీనగర్ సీఐ రాజు, లేక్ పోలీస్‌స్టేషన్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్సైలు హనుమంతునాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్‌లో మైసమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ దంపతులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి అర్చకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, ప్రకాష్, రాజు, ప్రవీణ్, రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి





మైసమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతులు